## బంకుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న డీఎస్‌వో

ఖమ్మం రూరల్, జూన్ 20: పెట్రోల్ బంక్ యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీఎస్‌వో చందన్‌కుర్ అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిని మద్దులపల్లిలోగల స్తంభాద్రి ట్రోల్ బంక్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం వినియోగదారుల అవసరార్థం వినియోగించే తాగునీరు, గాలి మిషన్లు, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో సమ్మయ్య, డీటీఎస్ విజయబాబు, బంక్ యజమానులు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సే డీసీసీబీ ప్రధాన లక్ష్యం




సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రఘునాథపాలెం, జూన్ 20 : రైతులకు మేలు చేసే విధానాలను తీసుకరావడమే డీసీసీబీ ప్రధాన లక్ష్యమని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయం టీఎస్ ప్రసాద్ సమావేశ మందిరంలో 127వ మహాజన సభ జరిగింది. పలు తీర్మాణాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ఎన్.వెంకటఆదిత్య, డీసీవో గంగాధర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీవో, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మార్కెఫెడ్ అధికారులు, పాలకవర్గ సభ్యులు, సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## నగరంలో యోగా డే ర్యాలీ

ఖమ్మం సిటీ, జూన్ 20 : ప్రపంచ యోగా డేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా యువజన, క్రీడల శాఖ, ఆయుష్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఖమ్మం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ పద్మావతి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డీవైఎస్‌వో తుంబూరు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలోని పురాతన యోగ విద్యను 194 దేశాల ఆమోదంతో యూఎన్‌వో ఆమోదించిందన్నారు. శనివారం ఉదయం 6:30 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగనున్న యోగా డే ఉత్సవాల్లో జిల్లాలోని అధికారులంతా పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ యోగా చేసి ఆరోగ్యంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం యోగ ధ్యాన సమైక్య కన్వీనర్ వంజాకు లక్ష్మీనారాయణరావు, కాసిని ఆనంద ప్రసాద్, డాక్టర్ కనకలక్ష్మి, బాలరాజు, శర్మ, శ్రీనివాసరెడ్డి, కోదండరావు, వరలక్ష్మి, సీతయ్య, సంధ్య, సమత, శైలజ పాల్గొన్నారు.

**విశ్వశాంతి విద్యాలయంలో..**



సత్తుపల్లి: యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

సత్తుపల్లి, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో యోగా ఆసనాలు, నమస్కారాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజరత్నచారి, విశ్వశాంతి పూర్వవిద్యార్థిని, హైదరాబాద్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ బత్రా భవానీ మాట్లాడుతూ శరీరం, మనస్సు, ఆత్మ మూడింటిని సమతుల్యంగా ఉంచే జీవన విధానం యోగా అని అన్నారు. ధ్యాన సాధన సక్రమంగా చేస్తే ఏకాగ్రత పెరుగుతుందని, చదువులో మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయని వివరించారు. యోగా అంటే కష్టమైన ఆసనాలు కాదని, దానిని వయస్సుతో సంబంధం లేదని, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. అనంతరం రాజారత్నచారి, భవానీని విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

## మున్సిపల్ ఉద్యోగులకు మెగా వైద్యశిబిరం



మెడికల్ హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి, మేయర్ నీరజ

ఖమ్మం సిటీ, జూన్ 20 : ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఆఫీస్ సిబ్బందితోపాటు క్షేత్రస్థాయిలోని కార్మికులు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ విధులు నిర్వహిస్తూ ఉంటారన్నారు. పని ఒత్తిడిలో భాగంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, టీఎంఎల్ టీ సుజాత, డీఎంఎల్ సుజాత, మెడికల్ క్యాంప్ ఇన్‌చార్జి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చందూనాయక్, ఎన్‌హెచ్ఎం దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

# సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

మామిళ్లగూడెం, జూన్ 20 : అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరేట్ రెవిన్యూ సిబ్బంది పని తీరుపై సెక్షన్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం ఒక బృందంగా పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని, ప్రజలకు అధికారులకు మంచి వారధిగా సిబ్బంది పని చేయాలన్నారు. ప్రతి సోమవారం వచ్చే ప్రజావాణి దరఖాస్తులు, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల కార్యాలయం నుంచి వచ్చే ప్రజావాణి వినతిపత్రాలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడానికి వీలులేదన్నారు. పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించి పరిధిలో లేనివాటికి సంబంధిత కారణాలు తెలుపుతూ ఫైల్ క్లోజ్ చేయాలని లబ్ధిదారునికి లేఖ రాయాలని ఆదేశించారు. ప్రతి శాఖ పరిధిలో పెండింగ్ ఫైల్స్, క్లియరెన్స్‌పై రెగ్యులర్‌గా సమీక్ష నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న కార్యాలయ సహాయకులు నుంచి అధికారుల వరకు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. అనుమతి తీసుకుని మాత్రమే సెలవుపై వెళ్లాలని తెలిపారు. కలెక్టరేట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో ప్రోటోకాల్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సీఎం, మంత్రుల మీటింగ్, పబ్లిక్ మీటింగ్ జిల్లాస్థాయి సమీక్షలు, పాటించాల్సిన ప్రోటోకాల్, ఫుడ్, ఆహ్వానం, సౌండ్, మినిట్స్ తయారు చేయడంపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసిజర్ తయారు చేసి ప్రతి అధికారికి వారి వారి భాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. జిల్లా పరిపాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీను ఉపయోగించుకుని సులువుగా పనులు ఏవిధంగా పూర్తి చేయాలగుతామో వివరిస్తూ అధికారులకు త్వరలోనే వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆధునిక సాంకేతికను అధికారులు అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ విభాగాలకు చెందిన సెక్షన్ ఇన్‌చార్జిలను పరిచయం చేసుకుని వారి నిర్వహిస్తున్న విధులపై పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్‌వో పద్మశ్రీ, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎర్రుపాలెం, జూన్ 20: ఎర్రుపాలెం సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ జీ.అనూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎర్రుపాలెం, రేమిడిచర్ల, పెద్దగోపవరం, మీనవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, కంద్రిక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**గౌరిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో..**

సత్తుపల్లి, జూన్ 20: మండలంలోని గౌరిగూడెం 33/11 కేవీ. సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ సత్తుపల్లి పట్టణ ఏఈ శరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, రేజర్ల, గౌరిగూడెం, సిద్ధారం, రాజీవ్‌నగర్, సర్వారాయ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

**తల్లాడ సబ్ స్టేషన్ పరిధిలో..**

తల్లాడ, జూన్ 20: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో, పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

## పోలీస్ అధికారులకు అభినందన

మామిళ్లగూడెం, జూన్ 20 : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతులు పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఎం.సూర్యనారాయణ, ఎం.కమాలస్‌బేగ్, వీఆర్ రాఘవయ్యలు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం వెళ్లారు.

## సామాజికాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

తిరుమలాయపాలెం, జూన్ 20: సామాజిక అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. మండలంలోని పిండిప్రోలు సమీపంలోని అనుషా గార్డెన్‌లో శుక్రవారం మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ పరిచయ వేదిక సభలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి మంచి వార్తలను ప్రచురిస్తే సమాజంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు పసలాది సత్యనారాయణ, పప్పుల శ్రీను కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, ఏవో నారెడ్డి సీతరామరెడ్డి, ఎంపీవో సూర్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు, మదార్‌సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఎండీ సయ్యద్ ఇమామ్, కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

# 30 వరకు మిషన్ ఇంద్రధనస్సు

ఖమ్మం సిటీ, జూన్ 20 : జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చందూనాయక్ అన్నారు. శుక్రవారం ఖమ్మం ఐడీవోసీలోని మీటింగ్‌హాల్‌లో మిషన్ ఇంద్రధనస్సు, యోగా డే, డయేయారియా అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, 0 నుంచి 5 ఏండ్లలోపు వయస్సు కలిగిన చిన్నారులకు వందశాతం టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్ధారించడమైందన్నారు. వంచితులైన చిన్నారుల కోసం ఇంటింటి సర్వేను నిర్వహించాలని సూచించారు. వలస కుటుంబాలను గుర్తించి టీకాలు వేయాలన్నారు. ప్రజల్లో అవగాహన కోసం గోడపత్రికలు అంటించి గ్రామసభలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల నియంత్రణ కోసం ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డీ హైడ్రేషన్‌ను అధిగమించేందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అంగన్‌వాడీ సెంటర్లలో ఓఆర్ఎస్ కార్నర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. యోగా డేను పురస్కరించుకుని శనివారం జిల్లా అంతటా యోగా పాటించాలని ఆదేశించారు. సమావేశంలో పీవో డాక్టర్ రామారావు, అదనపు జిల్లా ఆరోగ్య అధికారి బిందుశ్రీ, రమణ, జిల్లాలోని హెల్త్ సూపర్‌వైజర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యరహిత సమాజాన్ని నిర్మిద్దాం..

**టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య**



కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న సందీప్ శాండిల్య

మామిళ్లగూడెం, జూన్ 20 : మాదకద్రవ్యరహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పోలీస్ అధికారులతో మాట్లాడారు. జూన్ 26న నిర్వహించే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పుస్కరించుకుని 20 నుంచి 26వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వివరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, సీఐ స్వామి పాల్గొన్నారు.

# జిల్లా టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో టీటీ అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం సిటీ, జూన్ 20: హైదరాబాద్ లిటిల్‌ఫ్లవర్స్ హైస్కూల్‌లో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, సాంబమూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. షేక్ సాహెల్ ఫజల్(13 సంవత్సరా లు), గౌరిశెట్టి చార్విక్ స్థిత ప్రజ్ఞ(బాలురు 15 సంవత్సరాలు), పరిటాల జ్వలిత్(బాలురు 17 సంవత్సరాలు), ఎండీ అనస్ (17 సంవత్సరాలు), సాత్విక్, రాధాకృష్ణ, పిట్టల మోహిత్ కృష్ణ (19 సంవత్సరాలు బాలురు) ఉన్నా రు. బాలికల జట్టులో బొంతు సాయి కృష్ణ, శివానీ (13 సంవత్సరాలు), అమృత, గద్దల సిరి (17 సంవత్సరాల విభాగం)ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు షేక్ మజ్హార్, పరిటాల చలపతి, గద్దల రామారావు, రెడ్డి సాయి శివ, అజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిం చి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

## అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి

వైరాటౌన్, జూన్ 20: అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం ఎన్‌వీఎస్ గార్డెన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతి సత్యనారాయణగౌడ్ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా అభినందనసభ నిర్వహించారు. తొలుత వైరా అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. అనంతరం సత్యనారాయణ గౌడ్‌ను సన్మానించారు.

## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మ అర్బన్, జూన్ 20 : జిల్లాలో ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈవో సామినేని సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర కార్యదర్శి వీ వెంకటేష్ అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నవీన్, నరేందర్, సంతోష్ పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీ అరికట్టాలి

కారేపల్లి, జూన్ 20: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నాయని పీడీఎస్‌యూ నాయకులు అశోక్, కార్తిక్ అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ పీడీఎస్‌యూ అధ్వర్యంలో శుక్రవారం ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. విద్యాసంస్థలపై విచారణ చేపట్టి చర్యలు తీసువోవాలని లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీవోకు వినతిపత్రం అందజేత

రఘునాథపాలెం, జూన్ 20 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పలు సంఘాల అధ్యక్షులు శుక్రవారం ఖమ్మం సహకార అధికారి జీ గంగాధర్, సీఈవో వెంకట ఆదిత్యలకు వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ అధ్యక్షుడు కొత్తాల శ్రీనివాసరావు, కొత్తగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు మండె హనుమంతరా వు, మేడేపల్లి అధ్యక్షుడు సామినేని వెంకటేశ్వరరావు, కొణిజర్ల అధ్యక్షుడు చెరుకుమల్ల రవి, పాల్వంచ సొసైటీ సీఈవో లక్ష్మీనారాయణ ఉన్నారు.

## ఆక్వాకల్చర్‌తో మెరుగైన అవకాశాలు

ముదిగొండ, జూన్ 20: చేపల పెంపకం ద్వారా మెరుగైన అవకాశాలు లభిస్తాయని తహసీల్దార్ సునీత ఎల్జెబిత్ అన్నారు. సముద్ర ఉత్పత్తుల అభివృద్ధి, ఎగుమతులపై మండలంలోని ఖానాపురంలో రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆక్వాకల్చర్‌లో విభిన్న పద్ధతులు పాటించటం ద్వార మెరుగైన దిగుబడి సాధించి అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందనీ అన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు అందజేశారు.

## పామాయిల్ సాగుకు పెద్దపీట

వైరాటౌన్, జూన్ 20: పామాయిల్ సాగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పామాయిల్ మొక్కలు, డ్రిప్‌పై 90శాతం సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని వ్యవసాయ అధికారులు అన్నారు. శుక్రవారం మండలంలోని పామాయిల్ పంటను పరిశీలించారు. పామాయిల్ సాగుపై చేసి అధిక లాభాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి పవన్ సైదులు, రైతులు, పాలకుర్తి మోహిని, బ్రాహ్మణి, రమ్యకృష్ణ, సుంకవల్లి రామారావు, పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఇందిరమ్మ పాలన

తల్లాడ, జూన్ 20: పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో రూ.5.50 కోట్లతో నిర్మించిన రోడ్డును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తల్లాడ–నారాయణపురం– కొండవటిమెట్ట గ్రామాలను కలిపి రూ.5.50 కోట్లతో రోడ్డు నిర్మించామన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, ఈఈ తానేశ్వర్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, పెనుబల్లి డీఈ ఎండీ.ఖలీల్‌అహ్మద్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వల్ల అనారోగ్య సమస్యలు

మధిర, జూన్ 20: మత్తు పదార్థాల వాడడం వల్ల మానసిక, అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మధిర స్పెషల్ బ్రాంచ్ పోలీస్ అధికారి బత్తుల శ్రీనివాసరావు, పునరావాస నిర్వాహకులు గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మధిర మున్సిపాలిటీలోని దిడుగుపాడు గ్రామంలో మత్తు పదార్థాల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. మత్తు పదార్థాలు తీసుకున్న సమయంలో ఏమి చేస్తున్నామో అర్థం కాక అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

## మాజీ సర్పంచ్ సంతకం ఫోర్జరీ

ముదిగొండ, జూన్ 20: ఇందిరమ్మ కమిటీ సభ్యుడైన మాజీ సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. మండలంలోని మేడేపల్లి మాజీ సర్పంచ్ సామినేని రమేశ్ ఆ గ్రామ ఇందిరమ్మ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్లతోపాటు, ఇతర పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీనే కీలకంగా వ్యవహరిస్తున్నది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎల్–1లో కొందరిని ఎంపిక చేశారు. ఒకరు ఇల్లు కట్టుకోవటానికి సుముఖంగా లేకపోవటంతో మరొక లబ్ధిదారుడిని ఎంపిక చేయమని ఇందిరమ్మ కమిటీ తీర్మానం చేసి ప్రతిని ఎంపీడీవోకు పంపారు. రెండు రోజుల నుంచి అధికారులు లబ్ధిదారుల ఎంపికకు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తిని లబ్ధిదారుడిగా ఎంపిక చేయలేదని చెప్పడంతో మీ తీర్మానం ప్రకారమే విచారణ జరుపుతున్నామని అధికారులు తెలిపారు. దీంతో అయోమయానికి గురైన మాజీ సర్పంచ్ రమేష్ ఇతర సభ్యులను అడగగా తామే ఎంపిక చేశామన్నారు. తన సంతకం లేకుండా ఎలా తీర్మానం చేస్తారని అనుమానం వచ్చి ఎంపీడీవో కార్యాలయంలో తీర్మాన కాపీలో తన సంతకం ఉన్నది. దీంతో కంగుతిన్న రమేష్ తన సంతకం పోర్జరీ అయినట్లు గుర్తించి ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం - భార్య మృతి

మామిళ్లగూడెం, జూన్ 20: క్షణికావేశంలో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ భార్య మృతిచెందిన ఘటన ఖమ్మం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మూడో పట్టణ సీఐ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు, త్రివేణి(27) దంపతులు కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. దీంతో వారి మధ్య తరచూ స్వల్ప వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన నాగేశ్వరరావు ఈ నెల 13న గుర్తు తెలియని మాత్రలు మిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని బంధువులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లి వస్తూ భర్తకు సపర్యలు చేస్తున్న భార్య త్రివేణి కూడా ఈ నెల 15న ఎలుకల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. భర్త నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కూసుమంచి,(నేలకొండపల్లి), జూన్ 20: ఖమ్మం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్, ఖమ్మం శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి, తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ సహకారంతో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు.


**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మాలోతు గంగా**, W/o: **మోహన్**, **వయస్సు** : 38సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : 2-100/7, కస్నాతండా గ్రామము, ఖమ్మం రూరల్ మండలము, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం జిల్లా, అశ్యూరెన్సుల రిజిస్ట్రారు మరియు ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలము, తనగంపాడు రెవిన్యూ, కస్నాతండా గ్రామ పంచాయితీ పరిధిలోని, కస్నాతండా గ్రామము నందు ఇ.నెం. 2-100/7, (Assessment No. 171)గా గల R.C.C. & A.C Sheet Roof House ఖాళీ స్థల యుక్తముగా గల మొత్తం విస్తీర్ణం. 234-30 చ||గజములు = 195-90 చ||మీటర్లు, R.C.C. Roof నిర్మాణ వైశాల్యము = 270-00 Sq.Fts., & A.C. Sheet Roof నిర్మాణ వైశాల్యము = 351-00 Sq.Fts., (Including Toilets), మరియు అందుగల సమస్త శానిటరీ, ఫిక్చర్స్ మరియు ఫిట్టింగ్స్‌తో సహా డాక్యుమెంట్ **నెం.3286/2025**, గల అట్టి ఆస్తికి హద్దులు : **తూర్పు**: G.P. Road, **పడమర**: G.P. Road, **ఉత్తరం** : House of Maloth Bheema, **దక్షిణం** : House of Banoth Veeru.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542


## గ్రామాల్లో ఫ్రైడే- డ్రైడే

పెనుబల్లి, జూన్ 20: మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్.కిరణ్‌కుమార్ ఫ్రైడే–డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వాను పరీక్షించడం, జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది హెచ్‌ఈవో శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు బీ.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, సెక్రటరీ ముస్తఫా, ఏఎన్‌ఎంలు బేగం, కృష్ణకుమారి, రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న సూర్యా ధనుంజయ్

ఖమ్మం అర్బన్, జూన్ 20 : తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన మేరునగధీరులు దాశరధి–ఆరుద్రలు తెలుగు సాహిత్య చరిత్రలో వీరనారి చాకలి ఐలమ్మ అని మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనుంజయ్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'శత జయంతి సాహితీ మూర్తులు' పేరుతో దాశరధి–ఆరుద్ర జీవితం సాహిత్యంపై రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన తొలిరోజు సధస్సుకు సూర్యా ధనుంజయ్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. దాశరధి, ఆరుద్ర నేటి యువతరం అధ్యయనం చేయాల్సిన సాహితీవేత్తలని అన్నారు. సదస్సులో కేయూ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ బన్న అయిలయ్య, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్రారాజు, కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు రవిమారుత్, కేంద్ర సాహితీ అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ప్రసేన్, డాక్టర్ సునంద, డాక్టర్ పి రవికుమార్ పాల్గొన్నారు.

## 23న పెన్షనర్ల నిరసన ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

సత్తుపల్లి, జూన్ 20: పెన్షనర్లను విభజించి పాలించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 23న ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగల సంఘం నాయకులు కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం పెన్షనర్ల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానాన్ని బిల్లు రూపంలో పార్లమెంట్‌లో 2025లో ప్రవేశపెట్టిందని, అది చట్టంగా మారి పెన్షనర్ల ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 23న దేశ వ్యాప్త నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రామిశెట్టి సుబ్బారావు, కమలకుమారి, అద్దంకి వెంకటరత్నం, సాంబశివారెడ్డి, ప్రకాశ్‌రావు, బోడేపూడి బాబు, బూరుగు దాసు, మధుసూదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధే పీఆర్‌టీయూ ధ్యేయం

మధిర, జూన్ 20: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయంగా పని చేస్తున్నదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రంగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం, జాలిముడి, మల్లారం, సిరిపురం, మాటూరు, మర్లపాడు, నిధానపురం, జిలుగుమాడు పాఠశాల్లో ఉపాధ్యాయులందరిని కలుసుకొని సంఘ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పబ్లిక్ స్కూల్ స్థాపన పేరుతో పాఠశాలలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, నాయకులు ఆర్.బ్రహ్మారెడ్డి, ఎస్‌కే.మదార్, తూమాటి కృష్ణారెడ్డి, కొలగాని ప్రసాదరావు, కే.శాంతబాబు, మల్లెల శ్రీనివాస్, ఎం.బాబురాజా, డీ.శ్యామలరావు, ఎం.నాగేశ్వరరావు, రుద్రపోగు శ్రీను, జీ.కేశవులు పాల్గొన్నారు.

## తల్లాడలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయాలి

తల్లాడ, జూన్ 20: తల్లాడలో పత్తి మార్కెట్ తరహాలోనే మిర్చికి సబ్‌మార్కెట్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లాడ మండల పరిసర ప్రాంతాల్లో ఉన్న శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకున్నారని, పంటల సాగుకు పెట్టుబడి అవసరాల కోసం అమ్ముకోవడానికి 15 కి.మీ. దూరంలో ఉన్న వైరా మార్కెట్ వద్ద మిర్చి కొనుగోళ్లు ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి నుంచి మిరప బస్తాలను తీసుకెళ్లాలంటే ఖర్చుతో కూడుకుందన్నారు. సరైన ధర వచ్చిన రోజు అమ్ముకోవడానికి రైతులకు సౌకర్యం లేదన్నారు. నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, కల్యాణపు కృష్ణయ్య, శీలం ఫకీరమ్మ, చల్లా నాగేశ్వరరావు, మన్నేపల్లి రామారావు, సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, రాజబోయిన సైదులు, షేక్ నన్నేసాహేబ్ పాల్గొన్నారు.

## జూలై 9న దేశవ్యాప్త సమ్మె

పెనుబల్లి, జూన్ 20: జాతీయస్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠలరావు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వీఎం.బంజర్ రింగ్ సెంటర్‌లో మండల అధ్యక్షుడు తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ల ప్రయోజనం కోసం పనిచేస్తున్నది తప్ప కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 8 గంటల పనిని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమ దోపిడికి గురిచేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు, వివిధ యూనియన్ బాధ్యులు గుడిమెట్ల బాబు, మిద్దె స్వామి, అన్నపురెడ్డి లక్ష్మయ్య, జీ.వెంకటేశ్వర్లు, కొప్పుల గోవిందరావు, బుడ్డయ్య, దొంతు మాధవ, చందు, కడియం రాజు, ధనలక్ష్మి, కృష్ణ, కాకా సుజాత, రాజకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616